



తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




సంపుటి : 04 సంచిక : 536 హైదరాబాద్ సంపాదకులు బి.అనిల్ కుమార్ 28- మార్చి, 2025 పేజీలు : 16 వెల రూ.6/

## గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ.. అని అన్నామా?

బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం



హైదరాబాద్, మార్చి 27 ( ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో నిందిచడాన్ని బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ధ్వజమెత్తారు. 'ప్రభుత్వాన్ని బయటి వ్యక్తులు ఏదో అంటున్నారని అసెంబ్లీలో మీరు అనడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని కూడా బయట గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ అని అంటున్నారు. మేమేనాడైనా అలా విమర్శించామా?' అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి భట్టి ప్రశ్నించారు. తాను యాదృచ్ఛికంగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని, అణగారిన వర్గాల అభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశ్యంతో



## కక్ష సాధించే వాడినైతే..
# కుటుంబమంతా జైల్లోనే!

**ఇవాళ అసెంబ్లీలో కూర్చుని మాట్లాడేవారు కాదు- ఎంపీని 16 రోజులు ఒంటరిగా బంధించారు- జైల్లో రాత్రి నిద్ర పోకుండా లైట్లు వేసి వేధించారు**

**పదేళ్లలో బీఆర్ఎస్ రుణమాఫీ రూ.16,908 కోట్లే- పది నెలల్లో రూ.20,616 కోట్లు మాఫీ చేశాం- పదేళ్ల పాలనను మా పది నెలలతో పోల్చండి - అభినందించాల్సింది పోయి కడుపులో కత్తులా?- కేటీఆర్ గుంటూరు తెలివితేటలు ఇక్కడొద్దు**

**పల్లెటూళ్లో చదివి సీఎం అయ్యానని నాపై అక్కసు- ప్రాజెక్టులు కట్టింది మీ ఫామ్ హౌస్‌ల కోసమే- క్కడెవరు కొన్నారో నిజ నిర్ధారణ కమిటీ వేద్దామా?**

**కేటీఆర్, హరీశ్ రావులకు పార్టీ కుర్చీపై ఆశ- నేపాల్ తరహాలో కేసీఆర్‌ను తప్పించే కుట్ర- బడ్జెట్‌పై చర్చలో సీఎం రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు**

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. ఆ కోపాన్ని కూడా బిగపట్టుకున్నా

## అలా అయితే రాజకీయాలకు
# గుడ్ బై



## సర్కారు ఖాతాతో కార్పొరేషన్ల
# రుణాల చెల్లింపా?

- అలాంటి చెల్లింపులతో ఖాతాలో డబ్బులు ఉండట్లే
- ప్రభుత్వ పుస్తకాల్లో గ్యారెంటీ అప్పులు కనిపించట్లే
- చెల్లింపులు మాత్రం దర్శనమిస్తున్నాయ్!
- గ్యారెంటీలు ఇచ్చినందుకు సర్కారుకు ఫీజు ఏదీ?
- మొత్తం రాష్ట్ర అప్పులు రూ.6.24 లక్షల కోట్లు
- కిస్తీలు, వడ్డీల చెల్లింపులకే 15.90% సొమ్ము
- పరిమితికి మించి అప్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- 2023-24కి రాష్ట్ర ఆర్థిక స్థితిపై 'కాగ్' నివేదిక





## ఆ ఐదు కులాలను ఓబీసీల్లో చేర్చండి

కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌కు రాష్ట్ర నేతల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 27 : 'ఆంధ్రప్రదేశ్‌లోని శిష్టకరణం, కళింగ వైశ్య, సొండి, తూర్పు కాపు, అర్వల కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి. ఆమేరకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) ఇప్పటికే సిఫారసు చేసింది' అని రాష్ట్ర నేతలు పేర్కొన్నారు.



## డీసీసీలే పార్టీకి ఫ్రంట్ వారియర్స్

- మీరు దూతలు కాదు.. పార్టీకి రక్షణ రేఖలు
- బలహీన వర్గాలపై దాడుల నిర్మూలనకే కుల గణన..
- డీసీసీ అధ్యక్షుల భేటీలో ఖర్గే
- కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్షులే పునాది: రాహుల్
- తెలంగాణ, ఏపీ సహా 13 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల డీసీసీల సమావేశం

# కక్ష సాధించే వాడినైతే.. కుటుంబమంతా జైల్లోనే!

హైదరాబాద్, మార్చి 27(ఆ తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. ఆ కోపాన్ని కూడా బిగపట్టుకున్నా తప్ప కక్ష సాధింపునకు పాల్పడలేదు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయే వాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ సొంత పార్టీ ఆఫీసులో కొంత మందికి డబ్బులు ఇచ్చి తనను, తన కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా సంయమనంతో వ్యవహరిస్తున్నానన్నారు. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోందని వ్యాఖ్యానించారు.

ఆ తర్వాత బడ్జెట్‌పై చర్చలో చివరగా ముఖ్యమంత్రి మాట్లాడినపుడు కూడా కేటీఆర్‌పై ఎదురుదాడికి దిగారు. ఇంగ్లిష్ అనేది భాషే తప్ప జ్ఞానం కాదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న చైనా, జపాన్, జర్మనీల్లో ఉండే వారికి ఇంగ్లిష్ రాదని చెప్పారు. కేటీఆర్ నేర్చుకున్న నాలుగు ఇంగ్లిష్ ముక్కలు హోటల్‌లో ఆర్డర్ తీసుకునేందుకు, బట్టల దుకాణంలో బట్టలు అమ్మేందుకు అక్కరకు రావొచ్చరన్నారు. గుంటూరులో చదివిన తెలివితేటలు తమ వద్ద చూపించొద్దని హెచ్చరించారు. తెలుగు మీడియంలో గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని వచ్చానని, లోకల్ పరిజ్ఞానంతో పని చేస్తున్నానని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకొని, రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడు ముఖ్యమంత్రి సీట్లో కూర్చుంటే ఎందుకు కళ్లలో నిప్పులు పోసుకుంటారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల తర్వాత రెండోసారి కూడా తామే అధికారానికి వస్తామని రేవంత్ అన్నారు. పార్టీ అధినేతగా కేసీఆర్ కుర్చీ మీద కేటీఆర్, హరీశ్ కన్నేయడం భావ్యం కాదని వ్యాఖ్యానించారు. కుటుంబంలో పెద్ద దిక్కు ఉంటేనే ఆ కుటుంబానికి గౌరవం ఉంటుందని, ఆయన్ను ఖతం చేసి కుర్చీలో కూర్చొనే పథకాలు వేయొద్దని సూచించారు. గతంలో నేపాల్ యువరాజు దీపేంద్ర తనకు పదవి ఇవ్వలేదనే కోపంతో కుటుంబంలో 8 మందిని ఏకే 47తో కాల్చేశారని, అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో రాకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్‌ను కోరారు. రాష్ట్రంలో ఏ ఊరిలో పంట పండినా అది కాళేశ్వరం నీటితోనే పండిందని చెప్పే స్థాయిలో తప్పు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.

**పదేళ్ల పాలనతో బేరీజు వేయండి**

లక్ష రూపాయల రుణ మాఫీ చేయడానికి కేసీఆర్ నాలుగేళ్ల సమయం తీసుకున్నారని రేవంత్ అన్నారు. అంతా చేసి రూ.16,143 కోట్లు మాత్రమే మాఫీ చేశారని చెప్పారు. వడ్డీ పక్కనబెడితే కేసీఆర్ చేసిన మాఫీ రూ.13,514 కోట్లు మాత్రమే అని చెప్పారు. వీళ్లు తమను రుణమాఫీ చేయలేదని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 25,35,964 మంది రైతులకు రూ.20,616,89 కోట్లు మాఫీ చేసిందని ప్రస్తావించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత మాఫీ చేసింది? పది నెలల్లో కాంగ్రెస్ ఎంత మాఫీ చేసింది? చూడాలన్నారు. బీఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతుబంధు రూ.7,625 కోట్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చెల్లించామని చెప్పారు. రూ.4,666.59 కోట్లు రెండో విడత రైతు భరోసా అందించామని, రైతు భరోసాను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. వరి వేస్తే ఉరి అని చెప్పిన వాళ్లు ఫామ్ హౌస్‌లో పండిన వడ్లను క్వింటాల్ రూ.4,500 చొప్పున కావేరి సీడ్స్ కు అమ్ముకున్నారని ప్రస్తావించారు. దొర వడ్లకు వచ్చిన ధర రైతులకు ఎందుకు రాలేదన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.11 వేల కోట్ల బోనస్ ఇచ్చామని చెప్పారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనివి తాము పది నెలల్లో చేస్తే అభినందించాల్సింది పోయి కడుపులో కత్తులు పెట్టుకుని తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

**నా మీద కోపం ఉండొచ్చు కానీ**

కుర్చీని లాక్కున్నందుకు కేసీఆర్‌కు తన మీద కోపం ఉండొచ్చు కానీ మంచి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించవచ్చు కదా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 16 మంది ముఖ్యమంత్రుల హయాంలో తెలంగాణ ప్రాంత అప్పు రూ.90,160 కోట్లు అయితే, కేసీఆర్ హయాంలో పదేళ్లలో రూ.6,69,257 కోట్ల అప్పు చేశారన్నారు. ఇవి కాక, రూ.40,154 కోట్ల బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. మొత్తం కలిపితే రూ.8,19,151 కోట్లు ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పదిహేను నెలల్లో చేసిన అప్పు రూ.1,58,041 కోట్లు అని, అందులో రూ.88,591 కోట్లు పాత అప్పు, రూ.64,768 కోట్లు వడ్డీలు అని వివరించారు. 15 నెలల్లో తమ ప్రభుత్వ నిర్వహణకు చేసిన నికర అప్పు రూ.4,682 కోట్లు మాత్రమే అని స్పష్టం చేశారు.

# గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ.. అని అన్నామా?

## బీఆర్ఎస్ నేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం



హైదరాబాద్, మార్చి 27 ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో నిందిచడాన్ని బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ధ్వజమెత్తారు. 'ప్రభుత్వాన్ని బయటి వ్యక్తులు ఏదో అంటున్నారని అసెంబ్లీలో మీరు అనడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని కూడా బయట గంజాయిరాజ్, లిక్కర్‌రాణీ అని అంటున్నారు. మేమేనాడైనా అలా విమర్శించామా?' అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి భట్టి ప్రశ్నించారు. తాను యాదృచ్ఛికంగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని, అణగారిన వర్గాల అభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశ్యంతో వచ్చానని భట్టి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం నిధులు కేటాయించి ఒక్క పైసా ఖర్చు చేయలేదని తెలిపారు. గతంలో రాబడి, వ్యయాలకు పొంతన లేకుండా బడ్జెట్‌ను రూపొందించేవారని, నిధులు కూడా ఖర్చు చేసేవారు కాదని చెప్పారు. తమ ప్రభుత్వం వాస్తవానికి దగ్గరగా ఉన్న బడ్జెట్‌నే ప్రవేశపెట్టిందని తెలిపారు. గత ప్రభుత్వం వివిధ పనులు చేయించుకొని రూ.1,60,000 కోట్ల బిల్లులను బకాయి పెడితే తమ ప్రభుత్వం వాటిని చెల్లిస్తోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన రూ.50,000 కోట్లను (క్యారీఫార్వర్డ్ నిధులను చేర్చి) కూడా వారి అభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భరోసానిచ్చిందని, ఇప్పటికే యాభైవేలకి పైగా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మళ్లీ కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామకాలను చేపడతామని అన్నారు. అలాగే, వైశ్యుల కోసం రూ.25కోట్లు, బ్రాహ్మణులకు రూ.100కోట్ల నిధులను కేటాయించి అగ్రవర్ణాలకు కూడా ప్రభుత్వం అండగా ఉందని తెలిపారు. రూ.5లక్షలుగా ఉన్న ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని భట్టి పేర్కొన్నారు.

# అలా అయితే రాజకీయాలకు గుడ్ బై

హైదరాబాద్, మార్చి 27: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడి వేడిగా జరుగుతున్నాయి. ఆ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. సిరిసిల్ల, కొడంగల్.. ఏ నియోజకవర్గానికైనా వెళ్తామంటూ ఛాయస్ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ వదిలేశారు. ఏ గ్రామంలోనైనా 100 శాతం రైతు బంధు పూర్తయిందని నిరూపిస్తారా? అంటూ ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. నిరూపిస్తే రాజకీయల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ స్పష్టం చేశారు రైతుబంధు ఆపిందే కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పైగా తమపై ఆరోపణలు గుప్పిస్తున్నారంటూ అధికార పక్ష నేతలపై మండిపడ్డారు. అప్పులు పుట్టడం లేదంటూనే భారీగా అప్పులు చేస్తున్నారంటూ రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ చురకలంటించారు. కొత్త టెండర్లకు డబ్బులున్నాయి కానీ.. గ్యారంటీల అమలుకు మాత్రం నగదు లేదా? అని రేవంత్ ప్రభుత్వాన్ని సభ సాక్షిగా నిలదీశారు. రేవంత్ రెడ్డి ఎందుకు జైలుకు వెళ్లారని కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నివాసంపై డ్రోన్ ఎగరేస్తే ఊరుకుంటారా? అని సందేహం వ్యక్తం చేశారు. కుటుంబాలు మీకే ఉంటాయా? మాకు ఉండవా? అని ప్రభుత్వంలోని పెద్దలను కేటీఆర్ నిలదీశారు. ఒకరిని జైలుకు పంపే అధికారం ముఖ్యమంత్రికి ఉండదని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు. నేరాలు నిర్ధారించేది, జైలుకు పంపేది కోర్టులు మాత్రమేని ఈ సందర్భంగా కేటీఆర్ సభలో స్పష్టం చేశారు. ఓ వైపు కక్ష సాధింపులు లేవంటున్నారు.. అయినా తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పథకాలను ఎందుకు ఆపారని ప్రభుత్వాన్ని బల్లగుద్ది మరి కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలు వీళ్లను గోల్డ్ అనుకున్నారని.. కానీ వీళ్లు రోల్డ్ గోల్డ్ అంటూ కాంగ్రెస్ నేతలను కేటీఆర్ వ్యంగ్యాంగా విమర్శించారు. ఫార్మా సిటీపై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.రైతులకు పెట్టుబడి సాయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా రైతులందరికి పెట్టుబడి సాయం చేశామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే ఈ సాయం అందరికి అందలేదంటూ ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో కానీ.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో కానీ పర్యటిద్దాం. ఈ రెండు నియోజకవర్గాల్లో రైతులకు రైతు బంధు సాయం నగదు అందినట్లు రుజువు అయితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.మరోవైపు ఎన్నికల సందర్భంగా పలు హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయడం లేదంటూ అధికార కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అన్ని పథకాలు వల్ల ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. అలాగే గత బీఆర్ఎస్ పాలనలో రూ. లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. ఆ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

# అక్రమ వెంచర్ పై చర్యలకు కమిషనర్ వెనకడుగు







మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సిహెచ్ గణేష్,మార్చి 27(న్యూస్ తెలంగాణ)

పట్టణ కేంద్రంలో అక్రమ వెంచర్లు గత కొంతకాలంగా, రియాల్టర్లు ఏదేచగా ప్లాట్లను అమ్మకాలు చేస్తున్నారు. ఈ అక్రమ వెంచర్లకు అనుమతులు లేకున్నా, ప్లాట్లు చేసి అమ్మకాలు జరుపుకోవడం జరిగింది. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని సర్వినగర్ ప్రాంతంలో ఎలాంటి నోటీసులు లేకుండా ఆ పట్టాభూమికి సంబంధించిన రైతులు గోడను నిర్మించుకోగా కమిషనర్ కూల్చిన ఘటన జరిగింది. దాని వెనుక భాగంలో ఉన్న సర్వే నెంబరు 60, 62 లో ఓ రియాల్టర్ కు సంబంధించిన అక్రమ వెంచర్ ఉన్నప్పటికీ ఆ వెంచర్ పై చర్యలు తీసుకోకుండా అందులో రెండు మూడు రాళ్లు మాత్రమే తొలగించి, కొత్త నాటకానికి కమిషనర్ తెరలేపడంతో చర్చనీయాంశంగా మారింది. ఆ అక్రమ వెంచర్లో రాళ్లు తొలగించకుండా రియాల్టారుకు కొమ్ము కాయడంతో పాటు.. రైతులకు సంబంధించిన భూమిలో వారు నిర్మించుకున్న గోడను కమిషనర్ తొలగించిన తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ రియాల్టర్, కమిషనర్ ను సైతం బుట్టలో వేసుకున్నాడని వదంతులు వినిపిస్తున్నాయి. రియాల్టర్ల రీల్ దందాకు, కమిషనర్ కథానాయకుడిగా కనిపించడం విశేషం. ఒక అక్రమ వెంచర్లు వేసే రియాల్టర్ ఫోన్ చేసి కంప్లైంట్ చేస్తే రైతులకు సంబంధించిన గోడను కూల్చివేయడం కమిషనర్ కు సరికాదని వాపోతున్నారు. అక్రమ వెంచర్ల దందాకు అధికారులు కొమ్ముకాస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని.. ఇలాంటి రియాల్టర్ల నయా దందాకు కమిషనర్ సహకరించడం పై జిల్లా కలెక్టర్ స్పందించి రియాల్టర్ల అక్రమ వెంచర్ల వ్యవహారంపై వారికి కొమ్ముకాస్తున్న కమిషనర్ పై, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకొని ప్లాట్ల కొనుగోలుదారులకు న్యాయం చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

***అక్రమ వెంచర్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకుంటాం.***
***-తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్.***

ఈ అంశంపై విలేకరులు చరవాణి ద్వారా మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరగాసర్వినగర్ అక్రమ వెంచర్లకు ఎవరికి ఎలాంటి అనుమతులు లేవని, రైతులు నిర్మించుకున్న గోడకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, పక్కనే ఉన్న రియాల్టర్ అక్రమ వెంచర్ పై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించగా.. వెంచర్ నిర్వాహకునికి రేపు నోటీసులు ఇచ్చి రాళ్లను పూర్తిగా తొలగించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడం కోసమేరుపు.. కమిషనర్ ఈ రకంగా మాట్లాడడం పలు అనుమానాలకు తావిస్తుంది.

# రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు గడువు తేదీ పొడిగించాలి.

## -ధర్మ సమాజ్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జేరుపోతుల కరుణాకర్ మహారాజ్.

అక్షర విజేత ములుగు ప్రతినిధి:



రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువు తేదీ పొడిగించాలని ధర్మసమాజ్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల కరుణాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్ మహారాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించడం లో భాగంగా, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ 5 వరకు మాత్రమే ఉండడంతో కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో యువత దరఖాస్తు చేసుకుంటున్నారనీ తాసిల్దార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ ఉండడంతో సర్టిఫికెట్లు జారికావడానికి చాలా సమయం పడుతుందని ఈ సమస్యను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని అన్నారు. రేషన్ కార్డు లేని యువత మాకు లోను రాదని ఆందోళన చెందుతున్నారు. కావున వారికి అవకాశం కల్పించాలని గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక అయినా లబ్ధిదారులకు ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదని, తక్షణమే వారికి నిధులు మంజూరు చేసి యూనిట్లు రౌండింగ్ చేయాలనీ అన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్లో నిధుల కేటాయింపులు కాగితాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం చిత్త శుద్ధితో నిధులు మంజూరు చేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలనీ అన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్లో నిధుల కేటాయింపులు కాగితాలకే పరిమితం కాకుండా,ప్రభుత్వం చిత్తశుద్ధితో నిధులు మంజూరు చేసి బడుగు, బలహీన వర్గాల యువకుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు. బ్యాంకు లింకేజీ వలన బీసీ, ఎస్సీ, ఎస్టీ యువకులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి కార్పొరేషన్ల ద్వారా నేరుగా యూనిట్లు గ్రౌండింగ్ చేసి జరిగేలా చూడాలని లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని కరుణాకర్ మహారాజు అన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి 3 లక్షల 60 వేల విరాళం.



అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-

శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి 3,60,000/- (మూడు లక్షల అరవై వేలు) రూపాయలతో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గుడి నిర్మాణానికి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ దంపతులు, ఈ గుడి నిర్మాణానికి 3,60,000/- రూపాయలు వీరాళంగా అందించారు. ఈ సందర్భంగా కొత్త కుర్మ శివకుమార్ మాట్లాడుతూ గుడి నిర్మాణానికి ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి ఈ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెక్క మల్లయ్య, మైలారం బాబు, చెక్క బాల నరసింహ, చెక్క దయానంద్, బడవల్ల సుధాకర్, చెక్క కుమార్, మేతరి స్వామి, సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ మంకాల దాసు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చర్ల పటేల్ గూడ లో సినిమా సందడి.



అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని చర్ల పటేల్ గూడ గ్రామంలో ద ప్రీ వెడ్డింగ్ షో సినిమా షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమాలో హీరో తిరువీర్ హీరోయిన్ గా టీనా శ్రావ్య, మాస్టర్ రోహన్, డైరెక్టర్ రాహుల్ శ్రీనివాస్, ప్రొడ్యూసర్స్ సందీప్ ఆగారం, బాసాని అస్మితా రెడ్డి ఆధ్వర్యంలో ఈ సినిమా షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమా షూటింగ్ ను గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రొడ్యూసర్ బాసాని అస్మిత రెడ్డి మాట్లాడుతూ మా గ్రామంలో షూటింగ్ తీయడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు ఈ సినిమా షూటింగ్ కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ బాసాని అస్మితా రెడ్డి ఫ్యామిలీ మెంబర్స్ అందరూ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పలు సమస్యల గురించి అసెంబ్లీలో మాట్లాడిన సిర్పూర్ ఎమ్మెల్యే

అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పలు సమస్యల గురించి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడడం జరిగింది అని కాగజ్ నగర్ బీజేపీ మండల అధ్యక్షులు పుల్ల అశోక్ గురువారం అన్నారు. తనకు ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని జర్నలిస్ట్ ల సమస్యలు, సట్ట మట్కా, రైతుల పంట నష్టం, నియోజకవర్గంలో సాగు, తాగు నీటి గురించి, కరెంట్ గురించి మరియు అభివృద్ధి గురించి మాట్లాడి నియోజకవర్గం ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు.

# సెర్ఫ్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు









**-రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్.**

**-పెండింగ్ కమీషన్ బకాయిలు ఐకెపి కేంద్రాలకు చెల్లించేలా చర్యలు.**

**-స్టిచ్చింగ్ కేంద్రాల ద్వారా ప్రైవేటు ఆర్డర్లు సైతం చేపట్టాలి**

**-నవంబర్ వరకు జిల్లా సమైక్య భవనాల నిర్మాణం పూర్తి చేయాలి**

**-సెర్ఫ్ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన పంచాయతీరాజ్ కార్యదర్శి**

అక్షర విజేత ఖమ్మం:

సెర్ఫ్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదటమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు.గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకెపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకెపి లకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమీషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్దులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమీషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.3 నెలలు ఫించన్ తీసుకోని లబ్ధిదారులు వలస వెళ్లినట్లు సిస్టమ్ నమోదు చేస్తుందని అన్నారు. వలస వెళ్లినట్లు నమోదు అయిన వివరాలను అధికారులు పరిశీలన చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు. స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పరిశీలన చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్టిచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారులకు తెలిపారు. మహిళలచే చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హొటల్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు, వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ బీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అందజేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గతంలో ఖమ్మం జిల్లాలో ఉన్న 37 ఐకేపీ కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్ 137 కు పెంచడం జరిగిందని అన్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన కమీషన్ పౌర సరఫరాల శాఖ వద్ద పెండింగ్ ఉందని అన్నారు. గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో ఏర్పాటుకు సహకారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, డి.ఈ.ఓ. సోమశేఖర శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న కుటుంబ వ్యక్తి మరణిస్తే భార్యకు లేదా భర్తకు వెంటనే పెన్షన్ మంజూరు

**-ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

అక్షర విజేత ములుగు ప్రతినిధి:



కుటుంబంలోని భార్య లేదా, భర్త ప్రస్తుతం వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందిన పక్షంలో భర్త చనిపోతే భార్యకు వృద్ధాప్య లేదా వితంతు పింఛను, భార్య చనిపోతే భర్త 57 సంవత్సరాలు దాటినట్లయితే వృద్ధాప్య పింఛను వెంటనే మంజూరు చేయడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయితి రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాల మేరకు జీవో ఎమ్మెస్ నెంబర్ 31 ప్రకారం పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. నూతన పెన్షన్ పొందాలంటే గ్రామ పంచాయతీ సెక్రెటరీ కి స్పౌజ్ ఆధార కార్డ్ జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, మరణించిన వృద్ధాప్య పెన్షన్ దారుని మరణ ధృవీకరణ పత్రము అందచేయాలని తెలిపారు. జిల్లాలో ఎవరైనా వృద్ధాప్య పెన్షన్ పొందుతూ వ్యక్తి మరణించిన పక్షంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. గ్రామాలలో పలు రకాల పెన్షన్లను పొందుతున్న లబ్ధిదారుల వివరాలను, మృతి చెందిన వారి వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ గ్రామ పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. మరణించిన వృద్ధాప్య పెన్షన్ దారుని యొక్క భార్య లేదా, భర్త వివరాలను మండల స్థాయిలో ఎంపీడీఓ ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని, పంచాయితీ సెక్రెటరీ ఇచ్చిన నివేదిక ప్రకారం కంప్యూటర్ ఆపరేటర్ లాగిన్ లో నమోదు చేసిన వివరాలను ఎంపీడీఓ పరిశీలించి ధృవీకరణ చేయాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయిలో పరిశీలించి వెంటనే పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు : తాసిల్దార్ పున్నం చందర్.

**అక్షర విజేత బోనకల్ :**

గురువారం బోనకల్ తహసిల్దార్ కార్యాలయం లో మండల ముస్లిం మత పెద్దలతో బోనకల్ తహసిల్దార్ పున్నం చందర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇస్తున్న ఇఫ్తార్ విందు విధి విధానాలను వివరించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ ముస్లిం మత పెద్దలకు రాష్ట్ర ప్రభుత్వం మండలానికి కేటాయించిన 50 వేల రూపాయల నగదును అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ పార్టీ ఇవ్వడం చాలా సంతోషదాయకమని ,ఈ కార్యక్రమాన్ని సోదర భావంతో జరుపుకోవాలని ,ఇఫ్తార్ పార్టీ మతసామర్థ్యానికి ప్రతీక అని కొనియాడారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం మండల అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరుకావాలని అదేవిధంగా మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ,అన్ని పార్టీల మండల ప్రతినిధులు , ప్రజా ప్రతినిధులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం



ఐక్య సంఘం సభ్యులు చాంద్ పాషా, జానీ మియా ,దస్తగిరి, మదర్సాహెబ్ ,బాబు, గఫూర్ ,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార విస్తరణ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి





## -ఖమ్మం నగరంలో విజయ డెయిరీ పార్లర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్.

**అక్షర విజేత ఖమ్మం:**

వ్యాపార విస్తరణ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరం బుర్హాన్ పురం పాత డిఆర్డిఏ ఆఫీసు రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూనూతనంగా విజయ డెయిరీ పార్లర్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన పాల పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మధిరలో ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేశామని, విజయ డైరీతో సమన్వయం చేసుకుంటూ పాడి రైతులు నుంచి పాల సేకరణ చేసి సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. డెయిరీ పార్లర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ అందించేందుకు సహకారం అందిస్తామని అన్నారు. వేసవి కాలం దృష్ట్యా వ్యాపార అభివృద్ధిలో భాగంగా మిల్క్ షేక్, ఫాలుదా, పండ్ల రసాలు వంటివి విక్రయించేందుకు గల అవకాశాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.



పాలను ఉపయోగించి నాణ్యమైన లస్సీ తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డి.డి. మోహన్ మురళీ, డిస్ట్రిబ్యూటర్లు నరేష్, జగదీష్, విజయ డెయిరీ పార్లర్ నిర్వాహకులు మదార్, తదితరులు ఉన్నారు.

# బస్వాపురం లో యాసంగి వరికి బదులుగా జీరోటిల్లైజ్ మొక్కజొన్న సాగు శిక్షణ తరగతులు

**అక్షర విజేత చింతకాని:-**

చింతకాని మండలం బసవాపురం గ్రామంలో అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థ సమగ్ర వ్యవసాయ పద్ధతుల విభాగం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ హైదరాబాద్ వారిచే యాసంగి వరికి బదులుగా ఆరుతడి ( జీరోటిల్లేజ్) పంటలను రైతులు ఎలా పండించాలనే విషయంపై రైతులకు అవగాహన సదస్సు చింతకాని మండలం బసవపురం గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేందర్ నగర్ హైదరాబాద్ నుండి డాక్టర్ సిహెచ్. ప్రగతి కుమారి పాల్గొని ఆరుతడి పంటలను వానాకాలం వరి పంట తరువాత మొక్కజొన్నను ఎలా పండించాలి అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా మొక్కజొన్నను ఎలా సేద్యం చేయాలి అను పలు అంశాల మీద శిక్షణ ఇవ్వడం జరిగింది తరువాత మధిర నియోజకవర్గ ఏ డి ఏ విజయ చందర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్, పండ్ల తోటలు, కూరగాయలు పంటల దిగుబడి ఎలా వస్తుంది ఎలా పండించాలి. పంటలపై వచ్చు సబ్సిడీలు పలు అంశాలపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది మరియు ఈ కార్యక్రమంలో మధిర అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రుక్మిణి దేవి మాట్లాడుతూ రైతులు అన్ని పంటలపై అవగాహన పెంచుకొని దశలవారీగా పంటకు కావలసిన పౌష్టిక లోపాన్ని అరికట్టి పరిపుష్టిగా ఎరువులను అందించి లాభ సాటి దిగుమతులు ఎలా పొందాలో తెలిపారు. మరియు మధిర అగ్రికల్చర్ పరిశోధన సంస్థ అధికారి భరత్ మాట్లాడుతూ పప్పు ధాన్యముల పంటల సేద్యం వాటి లాభాలు గురించి వివరించారు. మదిర అగ్రికల్చర్



పరిశోధన సంస్థ మరో అధికారి నాగ స్వాతి మాట్లాడుతూ రైతులకు విత్తనాల ద్వారా వచ్చే తెగుళ్లు, విత్తన శుద్ధి చేసే ప్రక్రియ, రెక్కల పురుగు నివారణ, పలు అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో చింతకాని మండల వ్యవసాయ శాఖ అధికారి మానస వ్యవసాయ శాఖ బసవాపురం క్లస్టర్ అధికారి ఏ ఈ ఓ ఆయూషా ఫాతిమా మరియు గ్రామ పెద్దలు రాసాల మోహన్ రావు, మార్గం శ్రీనివాసరావు, బొడ్డు వెంకట రామారావు, సోమ సత్యం, ఆవుల నరసింహారావు, పోల్లా వెంకయ్య, వేములకొండ రమేష్, బద్దల నరసింహారావు మరియు వందనం, కోదుమూరు, రామకృష్ణాపురం , రాఘవపురం గ్రామ రైతులు ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్నారు.

# 23వ డివిజన్ లో రంజాన్ తోఫా పంపిణీ





## -లౌకికవాదం ప్రమాదంలో పడింది - డాక్టర్ షేక్ రెహానా బేగం, నున్నా నాగేశ్వరరావు.

**అక్షర విజేత ఖమ్మం :**

దేశంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత దేశ విశిష్టతకు నిదర్శనంగా వున్న లౌకికవాదం ప్రమాదంలో పడింది అని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నగర ప్రముఖ డాక్టర్ షేక్ రెహానా బేగం ఆందోళన వ్యక్తం చేశారు . సిపిఎం పార్టీ ఖమ్మం వన్ టౌన్ పరిధిలోని 23వ డివిజన్ లో రంజాన్ సందర్భంగా పెద్ద ఎత్తున తోఫాలు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అన్ని దేశాల టెక్నాలజీ, సైన్స్ సహాయంతో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుంటే బీజేపీ పాలనాలోని భారత దేశం మాత్రం మతం, కులం పేరుతో దేశాన్ని భ్రష్టు పట్టించే పనిలో బీజేపీ నాయకులు తలమునకలై ఉన్నారు అని ఆరోపించారు. కరోనా సమయంలో పేద ప్రజలను ఆదుకునేందుకు కేరళ ప్రభుత్వం ఉచితంగా అన్ని నిత్యావసర వస్తువులు అందజేశారు అని కానీ మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు రుణమాఫీ చేసే పనిలో వుంది అని ఆరోపించారు. లౌకికవాద భారతదేశాన్ని ఒక మతోన్మాద దేశంగా మార్చడానికి బీజేపీ, %తీంం%, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు అని దేశ ప్రజలు వీరి ఆగడాలపై జాగ్రత్తగా వుండాల్సిన అవసరం కనిపిస్తోందని అని తెలిపారు. వేల సంవత్సరాల నుండి భారత దేశంలో అన్ని మతాల వారు భాయ్ భాయ్ గా కలిసి వున్నారని కానీ ఇప్పుడు బీజేపీ అధికారంలోకి వచ్చాన తర్వాత మత ఘర్షణలు బాగా పెరిగాయి అని విమర్శించారు. రాబోయే కాలంలో దేశాన్ని ఐక్యంగా వుంచి లౌకిక ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకొనిపోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, డివిజన్ సెక్రటరీ వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులుజబ్బర్, స్క మీరా సాహిబ్, వన్ టౌన్ కార్యదర్శి స్క నాగులు మీరా, నాయకులు తంగిరాల శ్రీకాంత్, హరిష్ , బేగం, అజితా, రవి, నాగేశ్వరరావు, సుధాకర్, జగన్ మోహన్ రావు, సత్తార్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్.



**అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-**

ఇబ్రహీంపట్నం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు డి. సైదాన్ కు ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో "ఎన్ ఏఫిసియంట్ బ్రెయిన్ ట్యూమర్ క్లాసిఫికేషన్ ఫ్రమ్ ఎం ఆర్ ఐ ఇమేజెస్ యూసింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్" అనే అంశం పై రిటైర్డ్ ప్రొఫెసర్ పి. ప్రేమచంద్ మరియు సి.ఎస్.ఈ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ పి.వి. సుధ ఆధ్వర్యం లో ప్రయోగాత్మక పరిశీలన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి అందజేశారు. విశ్వ విద్యాలయం అధికారులు సమగ్ర పరిశీలన చేసి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ బాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ మారగోని వెంకటేశం, ఇతర డిపార్ట్మెంట్ హెచ్ఓడిలు, డైరెక్టర్లు, తోటి అధ్యాపకులు సైదాన్ ను అభినందించారు. సైదాన్ మాట్లాడుతూ డాక్టరేట్ పొందడం ఆనందంగా ఉందని పొందేందుకు సహకరించిన సిద్ధార్థ యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కి, తోటి ఉపాధ్యాయులకి, మిత్రులకు, కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపీడీఓ కార్యాలయానికి తాళం... కారణం ఇదే



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి**




పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కాగజ్ నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సర్పంచ్ లు గురువారం ఆందోళన చేపట్టారు. అధికారులను లోపలే ఉంచి తాళం వేసారు. తమ ఆస్తులు అమ్మి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు. బిల్లులు చెల్లించని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యం అని అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కాగజ్ నగర్లో 'మతువా బరోని' బెంగాలీ పూజ



**అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి**

కాగజ్ నగర్ మండలం ఇస్గాం విలేజ్ నంబర్ 1 నజురుల్ నగర్లో బెంగాలీలు గురువారం మతువా బరోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంగాలీలు గంగా స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని బెంగాలీ సోదరులతో కలిసి బరోని ఘాట్ చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ అన్నప్రసాద వితరణ చేశారు.

# ఆటలు శారీరక మానసిక వికాసానికి దోహదపడుతాయి



**అక్షర విజేత తిరుమలాయపాలెం**



క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు గురువారం సుబ్లేడు గ్రామంలో ఘనంగా ప్రారంభమైనాయి. క్రీడలు శారీరక, మానసిక వికాశానికి దోహదం చేస్తాయమని మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణ అన్నారు. తొలుత సంగబత్తుల సుమన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి క్రీడలు ప్రారంభించారు. తొలిరోజు పిండిప్రోలు, సుబ్లేడు టీములు బరిలోకి దిగాయి సుబ్లేడు టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్నారు. పిండిప్రోలు టీం బ్యాటింగ్ చేశారు.

ఆరోగ్యం శారీరక దృఢత్వం కోసం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. క్రికెట్ పోటీలు సుమారు వారం రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మన జీవితంలో క్రీడలు ఒక భాగం అని ఆయన తెలిపారు. ఆటలు శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు సామాజిక పరస్పర స్నేహబంధాన్ని పెంపొందిస్తుంది అని అన్నారు. ప్రోత్సహించడం ద్వారా ఆటలు క్రీడలు మన జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. క్రీడలలో పాల్గొనడం వల్ల హృదయ సంబంధ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, బలాన్ని పెంచడం కొరకు ఉపయోగపడుతాయి. బహుమతుల దాతలు గంధసిరి విజయ్, సంగబత్తుల శ్రీనివాస రెడ్డి, తీగల పల్లి శ్రీను బత్తుల వెంకటనారాయణ మొదటి బహుమతి లక్ష రూపాయలు షిల్డ్, రెండవ బహుమతి యాభై వేల రూపాయలు షిల్డ్ మూడవ బహుమతి ముప్పై వేయిల రూపాయలు షిల్డ్ నాల్గవ బహుమతి 20 వేల రూపాయలు షిల్డ్ ఈ కార్యక్రమంలో రవి కాంత్ రెడ్డి, గండమల సుందర్ రావు, కూరపాటి విజయ్ కుమార్ గంధసిరి విజయ్, బోడపట్ల భద్రమ్, గుంజ యలమంద, అనంతుల ప్రవీణ్, కామల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీఎమ్ కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి ఎమ్మెల్యే





అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి

సిర్పూర్ పేపర్ మిల్ 2018లో పున:ప్రారంభమైనప్పటి నుంచి కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించలేదని ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. ప్రభుత్వం, లేబర్ డిపార్ట్ మెంట్ చొరవ తీసుకొని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారి ప్రాణాలను కాపాడేందుకు ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఆర్ఎస్పీ



అక్షర విజేత కాగజ్ నగర్ ప్రతినిధి

కాగజ్ నగర్ మండలం నందిగూడ పంచాయతీలో గురువారం డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చలివేంద్రం ప్రారంభించారు. బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ.. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు తెలపాలన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు



అక్షర విజేత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్:

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో అరు గ్యారంటీలలో బాగంగా పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక అయిన పాసిగాం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకల పై గురువారం రోజు బిజెపి రెబ్బెన మండల శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు మల్రాజ్ రాంబాబు అధ్యక్షతన ఎంపిడిఓ కి వినతి పత్రం ఇచ్చారు.ఒక వేళా అర్హులందరికీ న్యాయం జరగకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటిలో ఇచ్చిన హామీ లో విఫలం అయిందని అన్నారు. పేద ప్రజల పక్షాన బీజెపీ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని బీ జే పి మండల అధ్యక్షుడు రాంబాబు పేర్కొన్నాడు.ఈ కార్యక్రమంలో జుమ్మిడి ప్రేమ్ సాగర్, సతీష్, సునీల్ ,మహేందర్ గౌడ్, వెంకటేష్ ,సంతోష్ ,రమేష్, అనిల్ ,గ్రామస్థులు పాల్గొన్నారు

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్

అక్షర విజేత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్:



ఆసిఫాబాద్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రాపర్తి రవీందర్ ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి పీసీ జైన్,సహాయ ఎన్నికల అధికారి నికోడే రవీందర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవి పోటీల్లో బోనగిరి సతీష్ బాబు, రాపర్తి రవీందర్ ఉండగా సతీష్ బాబు పై 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 46 ఓట్లు పోలుకాగా .రవీందర్ కి 28 వచ్చాయి సతీష్ బాబుకు 18 ఓట్లు వచ్చాయి. రవీందర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందినట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. వరుసగా రెండోసారి రవీందర్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా న్యాయవాదులు రవీందర్ ను అభినందించారు. ఉపాధ్యక్షులుగా చంద్రకుమార్ ప్రధానకార్యదర్శి ఎం చరణ్ సంయుక్త కార్యదర్శి ఎల్ నగేష్ కోశాధికారి .ఎం రామకృష్ణ గ్రంధాలయం కార్యదర్శి కుమారం లాల్ షా. మహిళ ప్రతినిధి ఆర్ .గాయత్రి మధురిమ క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి. కె కిషోర్ కుమార్ లు ఎన్నికైనారు

## ప్రతిజ్ఞ గీత రచయితకు గుర్తింపు ఏది?

అక్షర విజేత ఎర్రుపాలెం:



భారతదేశంలో అనునిత్యం పాఠశాలలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేసిన పిదపనే తరగతి గదిలోకి వెళ్ళే ఆనవాయితి పురాత కాలం నుంచి మన భారతదేశంలో ఉన్నదని అంతటి ప్రాచుర్యం పొందిన ప్రతిజ్ఞ గీత రచయితను గుర్తించకపోవడం విచారించదగ్గ విషయమని ఎం రాంప్రదీప్ గురువారం ఎర్రుపాలెం తాసిల్దార్ మన్నే ఉషా శారదను కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అంటూ ప్రతిజ్ఞను పైడిమర్రి వెంకట సుబ్బారావు రాశారని గుర్తు చేశారు.ఆయన ఖమ్మం జిల్లాలో కూడా ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారన్నారు. విద్యార్థుల నోళ్ళల్లో మీదిలే ప్రతిజ్ఞ రాసిన పైడిమర్రి కి తగిన ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం తాను రాసిన పైడిమరి జీవిత చరిత్రను తాసిల్దార్ కు బహుకరించారు

# ఆంజనేయ స్వామి దర్శించుకున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్







అక్షర విజేత మల్యాల కొండగట్టు

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామం లోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం రాష్ట్ర బీసి కమీషన్ చైర్మన్ నిరంజన్,బీసి కమీషన్ సభ్యులు జయ ప్రకాష్,సురేందర్,బాల లక్ష్మి, దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారులు వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అర్ధమండపంలో శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్డిఓ మధు సూదన్,బీసీ సంక్షేమ అధికారి సునీత,ఎమ్మార్వో మునీందర్,ఆలయ అధికారులు అర్చకులు,ఏఎస్ఐ శ్రీనివాస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# టాటా ఏస్ ట్రాలీ ఆటో పై నుండిపడి ఒకరు మృతి ఒకరికి గాయాలు

అక్షర విజేత మల్యాల కొండగట్టు

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ఘాట్ రోడ్డు గుండా క్రిందికి వెళుతుండగా టాటాఏస్ ట్రాలీ అజాగ్రత్తతో స్పీడ్ బ్రేకర్ వద్ద సడెన్ బ్రిక్ వేయగా ట్రాలీపై కూర్చున్న ఇద్దరు వ్యక్తులలో ఒకరు మృతి చెందారు ఒకరు తీవ్ర గాయాలయ్యాయి.వివరాలకు వెళ్తే సిరసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం రాజన్న పేట గ్రామానికి చెందిన శివరాత్రి లింగయ్య తన కుటుంబ సభ్యులతో మరియు చూట్టాలతో కలిసి కొండగట్టుకు వచ్చి దైవ ధర్శనం చేసుకొని గురువారం ఉదయం 8 గంటల సమయంలో శివరాత్రి లింగయ్య కొడుకు శివరాత్రి సాయి కృష్ణ (17)సం లు మరియు మరో వ్యక్తి సంపంగి ప్రేమ చంద్ లు కలిసి గోల్లేన విజయ్ చె%శీ%జర్ల గ్రామానికి చెందిన వ్యక్తి యొక్క టాటాఏస్ ట్రాలీ టీఎస్-19-టిఏ-1022 నెంబర్ గల వాహనం టాప్ పైన ఎక్కి కొండగట్టు గుట్ట ఘాట్ రోడ్డు నుండి కిందికి వస్తుండగా విజయ్ తన వాహనాన్ని అతివేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ మద్యలో స్పీడ్ బ్రేకర్ రాగా సడన్ బ్రేక్ చేయగా వెహికలే పైన కూర్చున్న శివరాత్రి సాయి కృష్ణ మరియు సంపంగి ప్రేమ చంద్ లు కింద పడగ వారిపై నుండి వెహికలే వెళ్ళగా ఇద్దరికీ తీవ్ర రక్తగాయాలు కాగా వెంటనే విషయం తెలుసుకొని శివరాత్రి లింగయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి పై ఇద్దరినీ



కరీంనగర్ ప్రబుత్వ హాస్పిటల్ కి తరలించగా శివరాత్రి లింగయ్య కొడుకు శివరాత్రి సాయి కృష్ణ కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్లో చికిస్థ పొందుతూ మద్యాహ్నం 12.30





గం. లకు మృతి చెందాడు,మరవవ్యక్తి హాస్పిటల్ లో చికిస్థ పొందుతూన్నడని లింగయ్య పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# రుణ మాఫీ పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల నిరసను







### -రైతు ఏడిచిన రాజ్యం, ఎద్దు ఏడిచిన ఎవుసం బాగుపడ్డట్టు చరిత్రలో లేదు.

అక్షర విజేత ఖమ్మం:

అధికారంలోకి వచ్చిన క్షణాల్లో అమలు చేస్తా అన్న రుణమాఫీ, ఎన్ని డిసెంబర్లు దాటిన, ఇంకా జాడ లేదు. - కడుపు కట్టుకొని కొంత కాలం ఉంటే చెప్పిన హామీలన్నీ క్రమం తప్పకుండా అమలు చేస్తామన్న ప్రభుత్వం, మాట మార్చడం, మడిమ తిప్పడం చేసింది- కాంగ్రెస్ రుణ మాఫీ పెద్ద బోగస్..అసలు 40, 000 కోట్లు కావాలి రుణ మాఫీ చేయడానికి- దానిని 30 వేలకి తరువాత 20వేలకి తీసుకొచ్చి, ఇప్పుడు 15 - 16వేల కోట్లు విడుదలకు బడ్జెట్ లో పేర్కొనడం చాలా మోసపూరిత చర్య.తెలంగాణ రైతులను వెన్నుపోటు పొడిచిన సర్కార్ రేవంత్ సర్కార్.రైతులకు తక్షణమే పూర్తిగా రుణమాఫీ చేయాలి అని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు శాసనమండలి నందు నిరసన తెలియజేశారు.

ఈ నిరసన లో ఎమ్మెల్సీ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ ధుసూధనాచారి, ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ వాణి దేవి, ఎమ్మెల్సీ నవీన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

# వృక్షశాస్త్రంలో పోరిక రమేష్ కు డాక్టరేట్ పేదింటీ బిడ్డ పెద్ద సదువు

### -ములుగు జిల్లాకు చెందిన పోరిక రమేష్ కు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రధానం.

అక్షర విజేత ములుగు ప్రతినిధి:

ములుగు జిల్లా, ములుగు మండలం, దేవగిరిపట్నం గ్రామానికి చెందిన పోరిక రమేష్ జుమ్మిలాల్, బుల్లిబాయి దంపతుల కుమారుడు. గిరిజన బంజారా కుటుంబానికి చెందిన పోరిక రమేష్ వ్యవసాయ ఆధారిత కుటుంబం. 100 సంవత్సరాల చరిత్ర కల్గిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మక విద్యా గౌరవాన్ని సాధించడానికి అనేక సవాళ్లను అధిగమించి వెనుకబడిన జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టి పెరిగి. ఆయన అంకితభావం మరియు పట్టుదల ఆయనను ఈ ప్రతిష్టాత్మక విద్యా గౌరవాన్ని సాధించాడు. నల్లమల అడవిలో కనిపించే అరుదైన స్థానిక ఔషధ మొక్క అయిన ఆర్గిరియా క్యూనియాటా యొక్క మధుమేహ నిరోధక లక్షణాల పై ఆయన పరిశోధన దృష్టి సారించింది.

“స్టడీస్ ఆన్ ఫైటోకెమికల్ ప్రొఫైలింగ్ అండ్ దేర్ బయోలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ ఆర్గిరియా క్యూనియాటా (విల్డ్) కెర్ గాల్వ్” అనే పరిశోధన అంశం పై ఉస్మానియా విశ్వవిద్యాలయం లో పోరిక రమేష్ కు వృక్షశాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి) డిగ్రీని ప్రదానం చేసింది. ఆయన పరిశోధన హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం లోని వృక్షశాస్త్ర విభాగంలో మాలిక్యులర్ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ లాబొరేటరీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. కిరణ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది.

రమేష్ కు డాక్టరేట్ రావడంపై ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్రం విభాగంకు చెందిన ప్రొఫెసర్స్, ఉస్మానియాలో పలువురు ఉద్యోగులు, తోటి పరిశోదకులు అభినందించారు. తన సొంత గ్రామం దేవగిరిపట్నంలో పలువురు రమేష్ ను ప్రశంశించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పలువురు ఆనందం వ్యక్తం చేశారు.







# టీజీఇజెఏసి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు






**అక్షర విజేత ఖమ్మం:**

టీఎన్జీవోస్ భవన్ నందు ఈరోజు ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముజామిల్ ఖాన్ హాజరయ్యారు. రంజాన్ మాసం ఆధ్యాత్మిక భక్తికి, స్వీయ క్రమశిక్షణకు ఉత్తమ సమయంగా భావిస్తారని సమాజంలో కృతజ్ఞత, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేద ప్రజలను ఆదుకోవడానికి వారికి దానం చేయడానికి కోపాన్ని నిగ్రహించుకోవడానికి ఈ రంజాన్ పండుగ జరుపుకుంటారని ముజామిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం జిల్లా జేఏసీ ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు పెంపొందించే విధంగా కృషి చేస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీఇజెఏసి చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ కో చైర్మన్ యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టిజీఓస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి,, లెక్చరర్స్ అసోసియేషన్ సంఘం కృష్ణార్జునరావ్ ,సురేష్, వాసిరెడ్డి శ్రీనివాసరావు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం బిక్కు, కోడి లింగయ్య డ్రైవర్ల సంఘం వెంకటేశ్వర్లు ,టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికై 26న చలో కలెక్టరేట్ సిపిఎం పోరుబాట

**- బుర్రి శ్రీరాములు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి**

**అక్షర విజేత మునగాల:**

మునగాలః కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రేపు 26న సిపిఎం పోరుబాట చలో కలెక్టరేట్ ముందు ధర్నాకు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొనలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు ప్రజలకు పిలుపునిచ్చారు మంగళవారం సిపిఎం స్థానిక సిపిఎం పార్టీ సుందరయ్య స్మారక భవనములో ముఖ్య కార్యకర్తల సమావేశం చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ రైతులకు ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు ఇస్తామని, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మాటలు చెప్పటం తప్ప పరిష్కారం చూపలేదని అన్నారు. ఎస్సారెస్పీ కాలువ కింద ఎండిపోయిన పంట పొలాలను పరిశీలన చేసే ప్రయత్నం ఇంతవరకు ప్రభుత్వం చేయలేదని వెంటనే ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఉపాధి హామీ పనితో సంబంధం లేకుండా 12 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రేపు కలెక్టరేట్ ముందు జరగబోయే ధర్నాకు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ



సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మండల కమిటీ సభ్యులు బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, మామిడి గోపయ్య, వీరబోయిన వెంకన్న, ఎర్రవెల్లి ఎంకన్న, తదితరులు పాల్గొన్నారు

# రామన్న కు ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మార్పీఎస్, ఢుడుం దెబ్బ నాయకులు.




**అక్షర విజేత ములుగు ప్రతినిధి:**

ఆదివాసి మా ఊళ్లో మా రాజ్యం అని నినాధించి, ఆదివాసీ తరాల భవిష్యత్ కోసం జల్ - జంగిల్ - జమీన్, ఉద్యమ స్ఫూర్తితో తుపాకి పట్టి ... పూరు బాటలో నడిచి అమరులైన ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, %డ% గ్రామీణ అభివృద్ధి, మహిళ,శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు గౌరవ సీతక్క భర్త గారైన కామ్రేడ్ గౌరవ కుంజ రామన్న గారి 20 వ వర్ధంతి యాది సభ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ అవార్డు గ్రహీత , భారత దేశ పీడిత వర్గాల ప్రజల దిక్సూచి మాన్యులు మంద కృష్ణమాదిగ ఉద్యమాల మహాజన సోషలిస్ట్ రాజ్యాధికార చైతన్య కార్యకర్త. నెమలి నర్సయ్య మాదిగ, తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్ట%శీ% ఉపేందర్ ఆదివాసి మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామీమాదిగ, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణఆదివాసి, ములుగు జిల్లా అధ్యక్షులు వట్టం జనార్ధన్, ఎమ్మార్పీఎస్ మహబూబాద్ జిల్లా అధికార ప్రతినిధి మిడత పల్లి యకయ్య, ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు అడ్మిషన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**అక్షర విజేత ములుగు ప్రతినిధి:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చేరడానికి కళాశాల రూపొందించిన 2025-26 సంవత్సరానికి అడ్మిషన్ కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ టీఎస్ దివాకర ఆవిష్కరించారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి కళాశాల అందిస్తున్న సౌకర్యాలను, గత సంవత్సరము కళాశాల విద్యార్థులు వివిధ ఉన్నత విద్య పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. .ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పుల మల్లేశం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి బాలయ్య, న్యాకు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ కవిత, కళాశాల అడ్మిషన్ కై దోస్త్ కన్వీనర్ డాక్టర్ జె శంకర్ మరియు దోస్త్ కమిటీ సభ్యురాలు అధ్యాపకురాలు బి శిరీష పాల్గొన్నారు.కళాశాల అడ్మిషన్లు పెంచడానికి అందరం సమిష్టిగా కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సిబిఐ చేత విచారణ జరిపించాలి.

**-ములుగు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద శాంతి నిరసన ర్యాలీ.**

**- తెలంగాణ ప్రజాసేన వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మ కంటి రమేష్ వర్మ డిమాండ్.**




**అక్షర విజేత ములుగు ప్రతినిధి:**

ములుగు కేంద్రంలోని, అంబేద్కర్ సెంటర్లో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానస్పద గా ఉందనీ తెలంగాణ ప్రజాసేన వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మకంటి రమేష్ వర్మ శాంతి నిరసన తెలుపుతూ అనంతరం మాట్లాడుతూ, వెంటనే సిబిఐ చే విచారణ జరిపించాలని తక్షణమే గవర్నమెంట్ స్పందించి, రిపోర్ట్స్ ఏవి అయితే వస్తుందో దాన్ని బయట పెట్టాలని, ఒకవేళ అది మర్డర్ అయితే నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, లేకపోతే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర సేవకులతో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని అన్నారు. అదేవిధంగా చట్టంలో ఏమని రాసిపెట్టి ఉందనీ, పాస్టర్లను చంపాలని మనుషులని చంపకండి.. మతాన్ని చంపండి.. మనుషులను ప్రేమించండి అని, తెలంగాణ ప్రజాసేన వ్యవస్థాపకులు బొమ్మ కట్టి రమేష్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టర్లు శాంతి ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముస్లీం సోదరకులకు ఇఫ్తార్ విందు



**అక్షర విజేత ఇల్లంతకుంట:**

మండలంలోని పెద్దలింగపూర్ గ్రామంలో ముస్లీం సోదరకులకు ఇఫ్తార్ విందు జనగాం శ్రీనివాస్ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లడుతూ మనమంతా ఒకటే హిందూ ముస్లిం అన్నదమ్ముల కలసి మెలసి ఉండాలి మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని అన్నారు, రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లీంలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పసుల నరేష్,సంఘం సభ్యులు బట్టు అనిల్, శనిగరం అనిల్ ,చిట్యాల సంజిత్,గంతుల రమేష్, మరియు ముస్లిం సోదరులు ఎండి రఫిక్, శాన్, యూసుఫ్ , హైదర్,రాజ్ మహమ్మద్ , సలీం,చాంద్ పాషా, మసూద్,తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్ష ఫలితాల్లో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థిని ప్రతిభ




**అక్షర విజేత ఇల్లంతకుంట:**

మండల కేంద్రంలోని కేరళ మోడల్ హై స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన టి. రేణుశ్రీ (హ.నెం 3594107) అనే విద్యార్థిని అత్యంత ప్రతిభను కనబరిచి నవోదయ సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్ తెలిపారు. పట్టణ ప్రాంతానికి దీటుగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న కేరళ మోడల్ పాఠశాల నుండి పదుల సంఖ్యలో గత కొన్ని సంవత్సరాలలో విద్యార్థులను ఒకవైపు గురుకుల పాఠశాల, మరోవైపు సైనిక, నవోదయ పాఠశాలలో సీట్లు సాధించగా వారికి విజయానికి కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. తాజాగా సీటు సాధించిన రేణుశ్రీ ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్, నరేష్ రెడ్డి ఉపాధ్యాయులు బాలకృష్ణ, బిజూ, ఘని, రాజేందర్, మహేందర్, ఎబిన్ లతో పాటు, తదితరులు పాల్గొన్నారు.

## సి సి రోడ్డు పనులు ప్రారంభం:



**అక్షర విజేత ఇల్లంతకుంట:**

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి 1 కోటి 30 లక్షల రూపాయలు నిధులను కేటాయించారు. అందులో భాగంగా గురువారం నర్సక్కపేట గ్రామంలో 5 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్, బూత్ అధ్యక్షులు దూది సుధీర్ రెడ్డి,బోల్ల రాంరెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎలెటి మాధవరెడ్డి, బండి భాస్కర్ రెడ్డి, ఖెంద్రం సుధాకర్ రెడ్డి , భద్రం రవీందర్ రెడ్డి, సుంకపాక చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



భువనగిరి కలెక్టరేట్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మంత్రి వర్గంలో అవకాశం కల్పిస్తున్నట్లు వస్తున్న ప్రచారం నేపథ్యంలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ అధ్వర్యంలో హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శు భాకాంక్షలు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు తెలంగాణ ఏర్పాటు చేయడం కోసం ఆత్మబలి దానాలు చేసుకుంటున్న క్రమంలో తల్లి సోనియా గాంధీ ఒప్పించి వెంటనే తెలంగాణను ప్రకటించేందుకు కృషి చేశారని ఆమె రుణం తీర్చుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిందని అన్నారు . అందులో భాగంగా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి కల్పిస్తే ఆనాడు ఆయన చేసిన పోరాటాన్నికీ గుర్తించి న్యాయం చేసిన వాళ్ళు అవుతారని అందుకోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈనేపథ్యంలోనే ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తు శు భాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు . రాజగోపాల్ రెడ్డికి మంత్రిగా అవకాశం దక్కడంతో మునుగోడు నియోజకవర్గం తోపాటు యాదాద్రి భువనగిరి జిల్లా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సుజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి యనగండ్ల సుధాకర్ మాజీ కోప్షన్ సభ్యులు సయ్యద్ ముల్తానిషా పాల్గొని ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీసీ రోడ్ల నిర్మాణం





**- ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం.**

**అక్షరవిజేత , హుజుర్ నగర్ :**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామం సామినేని నాగేశ్వరరావు బజారులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ కొట్టే సైదేశ్వరరావు,శెట్టి రామచంద్రరావు కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరు చేసిన సిసి రోడ్లను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవూరు గ్రామం అభివృద్ధి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సాధం సత్యనారాయణ, వి సుధాకర్ రెడ్డి,భూతం సత్యనారాయణ, భూతం మధు, మిత్తినేని రమేష్, స్వామినేని నరసింహారావు, భార్గవ్, గోవర్ధన్, సాదం కోటయ్య ,ధర్మారెడ్డి, తుమ్మల వెంకట్రావు,కొమ్ము కొండయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో విభేదాలు లేవు.

**-సమన్వయంతో పని చేస్తున్న కడియం....**

**-సంతృప్తిలో క్యాడర్....**

**-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు.....**

**అక్షర విజేత:రఘునాథపల్లిబీ**



స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని కొత్త పాత కాంగ్రెస్ పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంపీ కడియం కావ్య ముందుకెళ్తున్నారని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. గురువారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు టిపిసిసి వేసిన మండల గ్రామ కమిటీలు మాత్రమే ఉన్నావని మరియు ఇప్పటివరకు ఇచ్చిన వచ్చిన ఇందిరమ్మ కమిటీలు,మార్కెట్ కమిటీలు కానీ మరే ఇతర నామినేటెడ్ పదవులు గాని మండల కమిటీ మరియు సీనియర్ నాయకులు సూచించిన వారికి మాత్రమే ఇచ్చారని అన్నారు. ఈనెల 16న ముఖ్యమంత్రి బహిరంగ సభకు జన సమీకరణ కూడా గ్రామ మండల కమిటీల ఆధ్వర్యంలో జరిగినదని అన్నారు. రేపు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కొత్త పాత తేడా లేకుండా గ్రామ పార్టీ మండల పార్టీ నిర్ణయాల మేరకే అభ్యర్థులను ఎంపిక చేసుకుని కడియం శ్రీహరి,కడియం కావ్య నాయకత్వంలో వారిని గెలిపించుకోవడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, సీనియర్ నాయకులు గాదె మహేందర్ రెడ్డి, మినుముల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి బాష్ మియా, గుగులోతు కొమురెల్లి, లోనే శ్రవణ్ కుమార్, అల్లిబిల్లి కృష్ణ, పేర్ని రవి, బిర్రు మధు, ఎండి షబ్బీర్ మియా, కడియం యువసేన నాయకులు వడ్లకొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాలేజీ నడుపుతూ,ముందస్తు అడ్మిషన్లు తీసుకున్నటువంటి కార్పొరేట్ నారాయణ కాలేజీ ని సీజ్ చేయాలి.

**- పుల్లూరి సింహాద్రి పిడిఎసు జిల్లా అధ్యక్షులు**

**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి**




సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ నారాయణ కాలేజ్ ముందస్తు అడ్మిషన్ చేస్తున్న నారాయణ కాలేజ్ ను సీజ్ చేయాలని పిడిఎసు ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డీఈఓ భాను నాయక్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పిడిఎసు జిల్లా అధ్యక్షులు పూల్లూరి సింహాద్రి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవికాలం సెలవులలో నారాయణ కార్పొరేట్ కాలేజీలో తరగతులు నడపడంతో పాటు 2025-26 విద్యా సంవత్సరానికి ఎటువంటి అనుమతులు లేకుండా జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ నారాయణ కాలేజీ పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి పట్టణం మరియు గ్రామాలలో తిరుగుతూ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్ నిర్వహిస్తూ ఎటువంటి అకామిడేషన్ చూపించకుండా బ్రోచర్లలో ఫీజులను మెన్షన్ చేయకుండా తల్లిదండ్రుల అమాయకత్వంని ఆసరా చేసుకొని లక్ష నుంచి లక్షన్నర వరకు ఫీజు ఉందని చెప్పి ముందుగా అడ్వాన్స్ కట్టి స్లాట్ బుక్ చేసుకోవాలని ప్రచారానికి దిగారని తెలిపారు. కావున తక్షణమే నారాయణ కాలేజ్ కార్పొరేట్ విద్యాసంస్థను పట్టణంలో,గ్రామాలలో ప్రచార రానికి రాకుండా ఉండాలంటే పర్మిషన్ ఇవ్వవద్దని అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కావున ఇదే విషయమై విద్యాశాఖ అధికారులు యాజమాన్యం వైఖరి పై స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.లేనియెడల పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, ఉదయ్ మహేష్ నవీన్ వేణు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించి.... పలు సూచనలు చేసిన.

**-రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**అక్షర విజేత సూర్యాపేట ప్రతినిధి**

హుజూర్ నగర్ ప్రతి ఒక్కరికి 6 కేజీ ల సన్నబియ్యం పంపిణి చేసేందుకు ఉగాది (మార్చి 30) రోజు హుజూర్ నగర్ పట్టణంకు విచ్చేస్తున్న సందర్భంగా గురువారం సభ ఏర్పాట్లను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి ఎస్ చౌహన్,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సభకి వచ్చే ప్రజలకి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ ఉండేలా హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలని, త్రాగు నీరు, చల్లని త్రాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికంగా వాహనాలు వస్తాయి కాబట్టి ట్రాఫిక్ ని నియంత్రించాలని పార్కింగ్ స్థలాలకి ఆప్రోచ్ రోడ్లు రేపటిలోగా పూర్తి చేయాలని తెలిపారు.తదుపరి మంత్రి క్యాంప్ ఆఫిస్ నందు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అధికారులకు పలుసూచనలు చేసారు. సన్నబియ్యం పంపిణి కోరకు లబ్ధిదారుల ఎంపిక చేసి సిద్ధంగా ఉండాలన్నారు. లేదు స్క్రీన్ ప్రజలు తిలంకించె ప్రాంతాలలో పేట్టాలన్నారు,ప్రజలకు మజ్జిగ, చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండాలన్నారు.పోలీసు బందోబస్త్,ట్రాఫిక్ నియంత్రణ చాల ముఖ్యమన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజలకి కేజీకి 40 రూపాయల చొప్పున కొని దొడ్డు బియ్యం పంపిణి చేయటం వల్ల 8 వేల కోట్లు ఖర్చుపెట్టిన వాటిని ప్రజలు తినకుండా దుర్వినియోగం అయ్యాయని అందుకే ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడి సన్న బియ్యం పంపిణి చేస్తే తింటారని అలోచించి ఈ నిర్ణయం తీసుకున్నామని



తెలిపారు.సన్నబియ్యం పంపిణి వల్ల తెలంగాణ రాష్ట్రములో 84 శాతం మందికి లబ్ది చేకూరుతుందని ప్రతి ఒక్కరు సన్నబియ్యం తింటారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు అధికసంఖ్యలో పాల్గోని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి నరసింహ,అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వేణుమాధవరావు,డి ఎస్ ఓ రాజేశ్వర్, డి ఎం ప్రసాద్, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.